

సైక్లింగ్ ముగింపు కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఆరోగ్యవంతమైన సాంఘిక ఉద్యమంగా సైక్లింగ్

» గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శంకర్‌పల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సైక్లింగ్ ప్రస్తుతం ఆరోగ్యవంతమైన సాంఘిక ఉద్యమంగా మారిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. మీర్జాగూడ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్‌లో హెచ్‌సీఎల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సైక్లోతాన్ హైదరాబాద్-2025 ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అన్నివర్గాల ప్రజలు సైక్లింగ్ చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. సైక్లింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని అన్నారు. అదే విధంగా కాలుష్యం లేని సమాజాన్ని రూపుదిద్దడంలో సైక్లింగ్ ఎంతో దోహదం చేస్తుందని వివరించారు. హెచ్‌సీఎల్ గ్రూప్ ప్రెసిడెంట్ సుందర్ మహాలింగం మాట్లాడుతూ క్రీడా కార్యక్రమంగా ప్రారంభమైన సైక్లింగ్ ప్రస్తుతం దేశవ్యాప్త ఉద్యమంగా మారిందన్నారు. ఇది 16వేల మందికి పైగా రైడర్లను కలిపే కమ్యూనిటీగా ఎదిగిందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి మణిందర్‌సింగ్ తదితరులు ఉన్నారు. సైక్లింగ్‌లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు.



మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

» పర్యావరణవేత్త, విశ్రాంత ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

శంకర్‌పల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పర్యావరణవేత్త, విశ్రాంత ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి లా కళాశాలలో ఆదివారం జరిగిన మోడల్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ -2025 ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకోవడమే కాకుండా పరిష్కార మార్గాలను సైతం వెతకాలన్నారు. ప్రస్తుతం పర్యావరణ సంరక్షణ అతిపెద్ద సవాల్ అని, దాన్ని సంరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. సుస్థిరమైన భవిష్యత్ కోసం అందరూ కలిసి ప్రయత్నించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రవి శేఖర్ రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు అరుణ్‌కుమార్, శెట్టి రుద్రతేజ్‌లు, డీవీఎన్.మూర్తి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్ నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. కొందరు అక్రమార్కులు అనుమతులు లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వేస్తున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా ఇష్టారాజ్యంగా మట్టిని అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ అక్రమ దందాకు కొందరు రాజకీయ నాయకుల అండదండలున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులు చేయడానికి కూడా వెనుకాడటం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.



కొందుర్గు ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు

మట్టి.. కొల్లగొట్టి

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

షాద్‌నగర్ నియోజకవర్గంలో రెచ్చిపోతున్న మాఫియా

- అనుమతుల్లేకుండా రాత్రివేళ తరలింపు
- సర్కార్ ఆదాయానికి భారీగా గండి
- కోట్లకు పడగలెత్తుతున్న మట్టి వీరులు
- పట్టించుకోని అధికారులు



సంగెంలో అక్రమంగా తవ్వకాలు

షాద్‌నగర్/ కొందుర్గు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గ పరిధి ఫరూఖ్‌నగర్‌లోని ఎలికట్ట, కేశంపేట మండల పరిధిలోని సంగెం, కొందుర్గు మండల కేంద్రంతో పాటు, ముట్పూర్ గ్రామ పంచాయతీ చుక్కమెట్‌గుట్ట ప్రాంతాలలో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టిని తవ్వుతున్నారు. ప్రభుత్వ భూముల్లో ఎట్టిపరిస్థితుల్లో మట్టిని తీయొద్దని నిబంధనలున్నాయి. ప్రైవేటు భూముల్లో తవ్వకాలు జరపాలంటే అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలి. కాని ఈ నిబంధనలకు తూట్లు పొడుస్తూ పెద్దఎత్తున మట్టిని తవ్వి విక్రయిస్తూ లక్షల రూపాయలను గడిస్తున్నారు. అక్రమంగా తవ్విన మట్టిని అర్ధరాత్రి వేళలలో గుట్టుగా షాద్‌నగర్, శంషాబాద్ పరిసర

మిగతా 8వ పేజీలో...

అక్రమంగా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తాం



ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేస్తాం. కేశంపేట, కొందుర్గులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపినట్లు తమ దృష్టికి వచ్చింది. కొందుర్గులోని ప్రభుత్వ స్థలంలో మట్టి తవ్వకాలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేయించాం. అలాగే కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో మట్టి తవ్వకాలు జరిగింది వాస్తవం. కానీ ప్రస్తుతం తవ్వకాలను నిలిపివేశారు. అయినా కూడా అక్రమంగా మట్టి తవ్వకాల గురించి విచారణ చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించా. అర్ధరాత్రి వేళలో మట్టిని తరలించకుండా కాపలాదారులను నియమిస్తాం.

- సరిత, ఆర్డీవో, షాద్‌నగర్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సంజీవ్‌గుప్తా

క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపొందుతుంది

● నేవీ విశ్రాంత కమాండర్ సంజీవ్‌గుప్తా

శంకర్‌పల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యం పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, స్నేహభావం ఏర్పడుతుందని నేవీ రిటైర్డ్ కమాండర్ సంజీవ్ గుప్తా అన్నారు. ప్రొద్దటూరులో చెరుకూరి సురేంద్ర విఠల్ స్మారకార్థం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు ఆదివారం బ్యాడ్మింటన్ క్రీడాకారిణి కృష్ణప్రియతో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని సూచించారు. క్రీడలతో పాటుగా వివిధ రంగాల్లో రాణించి ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సుభిషి చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ ఎలవర్తి, ఉపాధ్యాయుడు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు



బోనంతో తహసీల్దార్ ఆర్‌పీ. జ్యోతి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శక్తి స్వరూపిణి మైసిగండి మైసమ్మ దేవత బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలతల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజు ఆదివారం బోనాలు, బండ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలతో తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తహసీల్దార్ ఆర్‌పీ.జ్యోతి అరుణ్, ఆలయ నిర్వాహకుడు రామావత్ భాస్కర్, మాజీ సర్పంచ్‌లు తులసీరామ్ నాయక్, శేఖర్ గౌడ్, ఉప సర్పంచ్ పాండు నాయక్, అర్చకులు యాదగిరి, బీచ్యనాయక్, స్థానిక నాయకులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

బుగ్గజాతరకు పోటెత్తిన భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయం



శివలింగానికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు





పార్కింగ్ స్థలంలో వాహనాలు

మంచాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీబుగ్గరామలింగేశ్వర క్షేత్రం ఆదివారం శివనామస్మరణతో మార్మోగింది. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో బుగ్గ జాతరకు తరలివచ్చి పుష్కరిణిలో కార్తీక స్నానాలు ఆచరించారు. వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. వాహనాల రాకతో బుగ్గక్షేత్రానికి వెళ్లే రహదారులు రద్దీగా మారాయి. జాతరలో ఏర్పాటుచేసిన పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయింది. ఆదివారం ఒక్కరోజే సుమారు 50 వేల మందికి పైగా భక్తులు జాతరకు తరలివచ్చినట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు కుటుంబసమేతంగా వనభోజనాలు ఆచరించి స్వస్థలాలకు తిరిగి వెళ్లారు.

వరికోతలు ముమ్మరం



యాచారం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో నాలుగు రోజులుగా వరికోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో 10వేల ఎకరాలలో వరి సాగైందని మండల వ్యవసాయాధికారి రవినాథ్ తెలిపారు. మండలంలో నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వరికోతలు జరిగి ధాన్యం చేతికొచ్చినా ఇంత వరకు ఒక్కటి కూడా ఏర్పాటుచేయలేదు. ఇదే అదునుగా భావించి దళారీలు నేరుగా రైతుల కల్లాల వద్దకు వెళ్లి ధాన్యం కొంటున్నారు. దళారులు క్వింటాల్‌కు రూ.4500కు కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మండలంలో కొనుగోలు కేంద్రాలను తెరవాలని రైతులు కోరుతున్నారు.

చెట్టు.. ప్రాణం పోదు ఒట్టు

- వృక్షాల పరిరక్షణకు రీ లొకేట్ విధానం
- తిరిగి నాటడం ద్వారా మోడులకు జీవం
- ఎన్‌హెచ్ 44హైవే విస్తరణలో అధికారుల నిర్ణయం
- పర్యావరణ ప్రియుల హర్షం

7

భగవంతుడు సర్వాంతర్యామి

» భారతీయ సాహితీ పరిషత్ ప్రచార కార్యదర్శి భాస్కరయోగి



సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న దంపతులు

శంకర్‌పల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భగవంతుడు సర్వాంతర్యామి అనే భావన హిందూమతం ప్రపంచానికి ప్రబోధిస్తుందని అఖిల భారతీయ సాహితీ పరిషత్ ప్రచార కార్యదర్శి భాస్కరయోగి తెలిపారు. శంకర్‌పల్లిలోని డీఎంఆర్ గార్డెన్‌లో ఆదివారం సామాజిక సమరసతా ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కులాలకతీతంగా దైవకార్యాలు నిర్వహించడం హిందూ బంధువుల గొప్పతనమని అన్నారు. ప్రపంచంలో హిందూమతం ఒక్కటే గడ్డిపోచ నుంచి పరమాత్మ వరకు అంతా దైవ స్వరూపంగా భావిస్తుందని గుర్తు చేశారు. పిల్లల్లో దైవ భక్తి, ఆధ్యాత్మిక చింతన పెంపొందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎన్‌సీడీ సంస్థ చైర్మన్ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్‌రావు, రమేష్, అనంత్ రెడ్డి, హరిసర్వోత్తం, నాగిరెడ్డి, నర్సింలు, శ్రీపాల్ రెడ్డి, జైరాంరెడ్డి, గోపాల్, కనకయ్య, అచ్చిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వైభవ్ ఆకాష్ ఉన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం!

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు

- ఆమనగల్లులో పొంచి ఉన్న ప్రమాదం
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- శాఖల మధ్య సమన్వయ లోపం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఆమనగల్లులో రోడ్డు మధ్యలో స్తంభాలుండటంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఆమనగల్లు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. వాటి తొలగింపు విషయంలో శాఖల మధ్య సమన్వయ లోపం కొరవడింది. విస్తరించిన రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్ మూలంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆమనగల్లు పట్టణంలో ఆమనగల్లు, మాడ్గుల రోడ్డులో భారీ ప్రమాదం పొంచి ఉన్నా పాలక ప్రజాప్రతినిధులు సైతం స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రయాణికులు, వాహనదారులకు ఆగ్రహాన్ని తెప్పిస్తుంది. ఆమనగల్లు పట్టణంలోని మాడ్గుల మండల కేంద్రానికి వెళ్లే

మిగతా 8వ పేజీలో...

వెంటనే తొలగించాలి



రోడ్డు విస్తరించి విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడం వల్ల ప్రమాదం పొంచి వుంది. విద్యుత్, మున్సిపాలిటీ, ఆర్ అండ్‌బీ శాఖల అధికారులు సమన్వయంతో వెంటనే వాటిని తొలగింపు చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రోడ్డును విస్తరించి స్తంభాలను తొలగించకుండానే డివైడర్‌ను నిర్మించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలుచోట్ల ఇరుకుగా మారి పెద్ద వాహనం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు విస్తరణ మూలంగా ప్రయాణీలకు కొత్త సమస్యలు తలెత్తున్నాయి.

- పత్యానాయక్, ఆమనగల్లు



మాట్లాడుతున్న ఎం.వెంకటేశ్వర్

న్యాయ సేవలపై అవగాహన కల్పించాలి

- జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్

వికారాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాలు పేదలకు ఉచితంగా అందించే న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్ తెలిపారు. న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. న్యాయసేవలు పేదలకు కూడా అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో న్యాయసేవా సంస్థ ఉచిత న్యాయ సేవలను అందజేస్తోందన్నారు. ఉచిత న్యాయసేవలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన బాల్య వివాహ, గృహ హింస నిరోధక చట్టాలు, పోక్సో వృద్ధుల సంరక్షణ చట్టాలు, చట్టాలను అతిక్రమిస్తే వేసే శిక్షలు, సామాజిక ప్రాముఖ్యతలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు భద్రత, మహిళా రక్షణ, పౌరుల న్యాయ అవగాహన అవసరాల గురించి వివరించారు. డొమెస్టిక్ వయోలెన్స్ చట్టం(డీవీసీ) కింద మహిళల హక్కులు, ఫిర్యాదు విధానం, న్యాయ సహాయంపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహబూబ్ ఫాతీమా, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ టి.వెంకటేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి.రాము, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎం.శ్రీనివాస్, లెక్చరర్లు షమీమ్ సుల్తానా, లలిత, వార్డెన్ షబానా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

- విరిగిన స్టీరింగ్ రాడ్డు



స్టీరింగ్ రాడ్డు విరిగి నిలిచిన బస్సు

తాండూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తాండూరు నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న తాండూరు ఆర్టీసీ డిపో అద్దె బస్సు(టీఎస్ 34 టీఏ5454) ఆదివారం తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌కు 40మంది ప్రయాణికులతో వెళ్తోంది. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ వద్ద బస్ స్టీరింగ్ విరిగిపోవడంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపేశాడు. ఆ సమయంలో బస్సు వేగం తక్కువగా ఉండటంతో ప్రయాణికులకు పెను ముప్పు తప్పింది. వెంటనే బస్సుకు మరమ్మతులు చేయించారు. తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌కు రోజూ 20 సర్వీసులు అటూ ఇటూ నడుస్తుంటాయి. కాగా స్టీరింగ్ నట్‌బోల్టు ఊడిపోవడం వల్లే బస్సు నిలిచిందని తాండూరు డిపో మేనేజర్ సురేష్ తెలిపారు. డిపో బస్సులన్నీ మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నాయని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో అధికారంలోకొచ్చేది బీఆర్ఎస్సే



సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

శంషాబాద్ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని ఎమ్మెల్యే సబితా రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నర్కూడ, చౌదరిగూడ, కాచారం గ్రామాల కాంగ్రెస్, బీజేపీల వంద మంది కార్యకర్తలు సబితారెడ్డి, కార్తీక్ రెడ్డిల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతున్నా హామీలు నేరవేర్చడంతో విఫలమైందన్నారు. మహిళలకు ఉచిత బస్సు తప్ప మరే పథకం అమలు కాలేదన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భర్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిద్యాల శ్రీనివాస్, పెద్దషాపూర్ మాజీ సర్పంచ్ బీసీసెల్ మండలాధ్యక్షుడు దేవులపల్లి సత్యనారాయణగౌడ్, బుర్కుంట సతీష్, గౌసపాషా, బాబు, గోపాల్, మహేష్, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండు.. అండగా ఉంటాం

- ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన తండ్రికి స్నేహితుల ఓదార్పు



ఎల్లయ్యగౌడ్‌ను పరామర్శిస్తున్న క్లాస్‌మేట్స్

తాండూరు, యాలాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన ఎల్లయ్యగౌడ్‌కు ఆదివారం ఆయన క్లాస్‌మేట్స్, ఆయన స్నేహితులు పేర్కంపల్లికి వెళ్లి పరామర్శించారు. ధైర్యం చెప్పారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన తనూష, సాయిప్రియ, నందిని ఫొటోలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. 1989-90 బ్యాచ్ టెన్త్ క్లాస్‌మేట్స్ అండగా ఉంటామని ఎల్లయ్యగౌడ్‌కు భరోసా ఇచ్చారు. ఓదార్చిన వారిలో తాండూరు వ్యవసాయ కమిటీ మాజీ ఛైర్మన్ విఠల్‌నాయక్ ఉన్నారు.

నేడు, రేపు బాలానగర్‌లో సెలవు

కీసర, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో మేడ్చల్ జిల్లాలోని బాలానగర్ మండలంలో పోలింగ్ నిర్వహిస్తున్న బూత్ కేంద్రాల కార్యాలయాలకు, సంస్థలకు సోమ, మంగళవారాల్లో సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ మను చౌదరి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10, 11 తేదీల్లో వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

మూడు కాళ్ల కోడిపిల్ల



కందుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోళ్లకు రెండు కాళ్లు ఉండడం సాధారణం. అయితే తిమ్మాపురంలో పొల్కం మల్లేష్ పౌల్ట్రీఫామ్‌లో ఆదివారం మూడు కాళ్లతో ఓ కోడిపిల్ల జన్మించింది. ఈ కోడిపిల్లను చూసి స్థానికులు విస్మయం చెందారు. అయితే జన్య లోపాలతో కొన్నిసార్లు ఇలా జరుగుతుందని పశువైద్యులు తెలిపారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత



బొక్కోనిగూడ దత్తాత్రేయ కాలనీలో నరికివేసిన చెట్లు

ఘట్‌కేసర్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): హరితహారం కార్యక్రమంలో భాగంగా గతంలో నాటిన మొక్కలు నేడు చెట్లుగా మారాయి. వాటిని సంరక్షించాల్సిందిపోయి తొలగిస్తున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని బొక్కోనిగూడ దత్తాత్రేయ కాలనీలో రోడ్డుకిరువైపులా చెట్లను పూర్తిగా తొలగించారు. తమ ప్లాట్లలోని చెట్లతో పాటు రోడ్డు పక్కల ఉన్న చెట్లను ఎలా తొలగిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల క్రితం నాటి చెట్లను రియాల్టర్లు యథేచ్ఛగా నరికేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. చెట్లను తొలగించాలంటే అటవీశాఖ అనుమతి తప్పనిసరి.. కానీ, ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా చెట్లను నరికివేస్తుండడంతో పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



బాసరలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తాండూరు కవులు కోటం చంద్రశేఖర్, వడిచర్ల సత్యం తదితరులు

బాసర కవి యాత్రలో తాండూరు కవులు

తాండూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 8, 9వ తేదీల్లో నిర్మల్ జిల్లా బాసరలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో తాండూరు కవులు కోటం చంద్రశేఖర్, వడిచర్ల సత్యం పాల్గొన్నారు. అక్కడ జరిగిన నాటక ప్రదర్శన, కవి సమ్మేళనం, అష్టావధానం, పుస్తకావిష్కరణ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాండూరు కవి వడిచర్ల సత్యం అధ్యక్షుడిగా ఏర్పాటైన కార్యక్రమంలో ఎన్నారం శ్రీనివాస్ రచించిన మానస పద్య శతకం నవీన్ గోరింక రచించిన రైతన్న మణిపూసల శతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి రచయిత పోరెడ్డి రంగన్న, అష్టవధానులు ఓంప్రకాశ్, కమలేశ్, సాహితీవేత్త, ప్రజ్ఞాశాలి దొరవెట్టి చెన్నయ్య పాల్గొన్నారు.

చెట్టు.. ప్రాణం పోదు ఒట్టు

వృక్షాల పరిరక్షణకు రీలొకేట్ విధానం

- తిరిగి నాటడం ద్వారా మోడులకు జీవం
- ఎన్‌హెచ్ 44 హైవే విస్తరణలో అధికారుల నిర్ణయం
- పర్యావరణ ప్రియుల హర్షం



మట్టి ఊడకుండా గోనె సంచితో కట్టిన చెట్లవేర్లు



రీ లొకేట్ చేసిన వృక్షాల మోడులు

షాద్‌నగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రహదారుల విస్తరణకు రోడ్డు పక్కన పెంచిన వందలాది వృక్షాలు నరికేయడం గతంలో చూశాం. దశాబ్దాల వయసున్న భారీ వృక్షాలు నేలమట్టం అయితే ఎంతో మంది ఆవేదన చెందుతారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారింది. రహదారుల నిర్మాణానికి తొలగించే చెట్లను వేరే చోట రీలొకేట్ చేస్తూ వాటిని సంరక్షిస్తున్నారు. కూకటి వేళ్లతో పెకిలించి తీసుకెళ్లి మైదాన ప్రాంతాలు, అడవుల్లో నాటుతున్నారు. జాతీయ రహదారి పక్కనున్న చెట్ల విషయంలో అధికారులు ఈ విధానాన్ని పాటిస్తుండటం పర్యావరణ ప్రియులకు ఆనందాన్ని కల్గిస్తోంది. మరి ఏమిటీ విధానం.. దీంతో కలిగే ప్రయోజనాలేమిటి అన్న అంశాలను పరిశీలిస్తే...

గతంలో ఇలా..

రహదారుల విస్తరణలో రోడ్డుకు ఇరుపక్కల వృక్షాలను తొలగింపు పనులు సామిల్ కాంట్రాక్టర్లకు అప్పగించేవారు. వారు చిన్న చెట్లు, పెద్ద వృక్షాలను భారీ మిషన్లతో కట్‌చేసి కలపను విక్రయించేవారు. ఇలాంటి చెట్ల నరికివేతలు షాద్‌నగర్ పాత జాతీయ రహదారి విస్తరణ, పరిగి రోడ్డు, బైపాస్ రోడ్డు విస్తరణలో ఎన్నోసార్లు జరిగాయి. ప్రయాణికులకు నీడనిచ్చే చెట్లను నరికివేస్తుండటంతో ఎంతో మంది బాధపడ్డారు. ప్రభుత్వం చెట్లను పెంచి మరో పక్క నరికివేస్తుండటం జనం కూడా ప్రజలకు అసంతృప్తి కల్గించింది. అయితే వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదారుల విస్తరణ అనివార్యం. కొత్త విధానంతో రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న వృక్షాలను కొన్ని చర్యలతో వేరే చోట నాటి పరిరక్షిస్తున్నారు.



క్రేన్లతో చెట్లను నాటుతున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

వృక్షానికి రక్ష

ఈ ట్రీ రీలొకేషన్(రీ ప్లాంటేషన్) విధానంతో వృక్షానికి పూర్తి రక్షణనిస్తుంది. భారీ వృక్షాలను క్రేన్లతో కూకటి వేళ్లతో పెకిలిస్తారు. వేళ్లకున్న మట్టి ఊడిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. చెట్టును బయటకు తీసి సస్యరక్షణ చర్యలతో వేర్లకున్న మట్టి పోకుండా గోనె సంచితో కడతారు. వేళ్లు ఎండిపోకముందే తీసిన కొన్ని గంటల్లోనే మొదళ్లతో వేరే చోటికి తరలించి అప్పటికే తీసిన భారీ గుంతలో వృక్షానికి అవసరమయ్యే పోషకాలు పోసి దానిలో నాటతారు. అనువైన ప్రదేశాల్లో నాటి ఎండిపోకుండా చర్యలు చేపడుతున్నారు. భారీ వృక్షాలను అటవీ ప్రాంతంలో క్రేన్లు, డోజర్లతో లోతైన గుంతలు తీసి నాటుతున్నారు. పచ్చదన పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు ఇవి. ప్రస్తుతం ఎన్‌హెచ్ 44 ఆరులేన్ల రహదారి విస్తరిస్తున్న నేపథ్యంలో రోడ్డు పక్కన వృక్షాలను తొలగించే క్రమంలో ఈ విధానాన్ని పాటిస్తున్నారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఇది మంచి పరిణామం



పర్యావరణ పరిరక్షణకు ఇలాంటి చర్యలు తీసుకోవడం మంచి పరిణామం. పర్యావరణ సమతుల్యానికి భూమిపై పచ్చదనం 33 శాతం ఉండాలి. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో 24శాతమే ఉంది. దీనికి ప్రధాన కారణం పచ్చదనాన్ని పెంపొందించక పోవడమే. రోడ్ల విస్తరణకు భారీ వృక్షాలు, చెట్లను నరుకుతున్నాం. అయితే ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణలో చెట్లను నరకకుండా కూకటి వేళ్లతో పెకిలించి మరో చోట నాటుతుండటం హర్షణీయం. వృక్షాల మొదళ్లను పారిశ్రామికవాడల్లో నాటితే ఉపయోగకరం. దేశవ్యాప్తంగా ఇలాంటి విధానాన్నే పాటిస్తే పచ్చదనం పెరిగి కరువును నివారించొచ్చు.

- రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, షాద్‌నగర్

పర్యావరణానికి ఉపయోగం



పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణ తప్పదు. అయితే పర్యావరణ పరిరక్షణా అవసరమే. రహదారుల విస్తరణతో పాటు రోడ్డు పక్కనుండే వృక్షాలను వేళ్లతో పెకిలించి రిలొకేట్ చేయడం మంచి పరిణామం. అయితే ఏ ప్రాంతంలో వృక్షాలను తొలగించారో అదే ప్రాంతంతో నాటాల్సిన అవసరం ఉంది. లేదంటే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలకు కృతజ్ఞతలు.

- గంగిరెడ్డి, సామాజికవేత్త, షాద్‌నగర్



కమ్మ సేవాసమితి మహిళా కళాకారులతో చిట్టూరి సురేష్‌రాయుడు, అరికెపూడి గాంధీ

ఐక్యతతో అభివృద్ధిని సాధించాలి

కమ్మ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కమ్మ కులస్తులంతా ఐక్యతను చాటి, అభివృద్ధి సాధించాలని తెలంగాణ కమ్మ సేవా సమితి అధ్యక్షుడు, తెలంగాణ ప్యాక్ ఛైర్మన్ అరికెపూడి గాంధీ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ కమ్మసేవా సమితి అధ్యక్షుడు పాతూరి వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ శేషయ్యనగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కమ్మవారి కార్తీక వనభోజనోత్సవానికి ఎమ్మెల్యే గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉసిరిచెట్టు వద్ద మహిళలు పూజలు చేసి, కూచిపూడి నృత్యాలు, ఆటలు పాటలతో అలరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రైవేట్ లెక్చరర్ శివకుమార్‌కు పాతూరి హైమవతి ఆధ్వర్యంలో మహిళలు 25వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. అది చూసిన అక్కడున్న పెద్దలు లక్షా 50వేలు ఇచ్చారు. గాంధీ మాట్లాడుతూ.. ప్రభుత్వ సహాయంతో శివకుమార్‌కు వైద్యం చేయించడానికి కృషిచేస్తానని తెలిపారు. కమ్మసేవా సమితి యేటా కార్తీక వనభోజనోత్సవాన్ని నిర్వహించడం, మహిళలు ఉత్సాహంగా వివిధ కార్యక్రమాలలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వ్యాపారాలు, రాజకీయాలు ఏమున్నా.. కమ్మలంతా ఐకమత్యంతో ముందుకుసాగాలని, అభివృద్ధికి పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. పౌల్ట్రీ రైతుల ఆస్తి పన్నును ప్రభుత్వం మాఫీ చేసిందని, ఎవరేం ప్రచారం చేసుకున్నా పట్టించుకోవద్దని, పంతాలకు పోవద్దని సూచించారు. అనంతరం మహిళా కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో వరల్డ్ ఎగ్ కమిషన్ ఛైర్మన్ చిట్టూరి సురేష్‌రాయుడు, కార్పొరేటర్ శ్రీకాంత్, కమ్మసేవా సమితి నాయకులు వసంతరావు, ప్రభాకర్‌రావు, బి.నాగేశ్వర్‌రావు, వి.రామసుబ్బారావు, పి.బ్రహ్మయ్య, పి.సత్యనారాయణ, వి. ఎర్రయ్య, జె.శ్రీనివాసరావు, కె.ప్రభాకర్, ఎం.మల్లేశ్వర్‌రావు, పి.రఘు, కె.హరి, కె.శ్రీను, ఎం.సాంబశివరావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ధర్మాన్ని ఆచరిస్తే భగవదనుగ్రహం

- కెంపిన మఠం పీఠాధిపతి డాక్టర్ చెన్నబసవ ప్రభు మహాస్వామి
- దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయంలో శతరుద్రాభిషేకం, సహస్ర దీపోత్సవం



దామగుండం రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సహస్ర దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న కెంపినమఠం పీఠాధిపతి చెన్నబసవప్రభు మహాస్వామి

పూడూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడి భగవంతుడికి చేరువ చేస్తుందని ఆలంపల్లి కెంపిన మఠం, దుద్దిని పీఠాధిపతి డాక్టర్ చెన్నబసవప్రభు మహాస్వామి అన్నారు. తెలంగాణ వీరశైవ జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకం, కార్తీక సహస్ర దీపోత్సవం, వన భోజన కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథి చెన్నబసవప్రభు మాట్లాడుతూ.. ధర్మాన్ని ఆచరిస్తే జీవితానికి భుక్తి, ముక్తి లభిస్తుందన్నారు. క్రియా, జ్ఞాన యోగాల సమ్మిళితమే కార్తీక విశిష్టత అన్నారు. శివకేశవులు వేరువేరు కాదని, శివుడిని పూజిస్తే విష్ణువు కరుణిస్తాడన్నారు. దామగుండం పవిత్ర, విశిష్ట క్షేత్రమని, శివుడు, కోనేరు, మర్రి ఊడలు నేలను తాకేలా ఉన్న ఈ చోటు పరమ పవిత్రమైందన్నారు. ప్రతీ కార్తీకంలో రుద్రాభిషేకం, దీపోత్సవం, వన భోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్, కుటుంబ సభ్యులు అభినందనీయులని కొనియాడారు. వేద పండితుడు మఠపతి సాంబశివశర్మ మాట్లాడుతూ.. మానవులు ధర్మార్థకామమోక్షాలను అనుసరించాలన్నారు. ధర్మబద్ధంగా ఉండాలని, అప్పుడే భగవత్ సాక్షాత్కారం లభిస్తుందని చెప్పారు. శివకేశవులను స్మరించుకున్నా, దర్శించుకున్నా, స్పర్శించినా పుణ్యఫలమని, దీపారాధనతో శివకేశవుల అనుగ్రహం పొందుతామని చెప్పారు. కిషన్‌నగర్ వేదపాఠశాల ప్రధానాచార్యులు సంగయ్యస్వామి మాట్లాడుతూ.. కార్తీకమాసంలో శివకేశవారాధనా, దీపారాధనకు, దానాలకు ప్రాముఖ్యం అన్నారు. మనుషులు ధనార్జన, కోరికలు నెరవేర్చుకోవడంపైనే దృష్టి సారించారని, ధర్మం, మోక్షం గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం చెన్నబసవ ప్రభు మహాస్వామి సహస్ర దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ వీరశైవ జంగమ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు వీరయ్యస్వామి, పురాణం నాగయ్యస్వామి, ఉపాధ్యక్షుడు మఠం రాజశేఖర్, నటరాజ్‌స్వామి, చంద్రశేఖర్‌స్వామి, ప్రదీప్ కుమార్, పార్వతయ్యస్వామి, బసవరాజ్ స్వామి, మహేశ్, శివకుమార్, నవీన్‌కుమార్, నరేష్, శివశంకర్‌స్వామి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ పాలన



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు చావు దెబ్బ తప్పదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉండడంతో అదే పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా చేసుకునేందుకు ప్రజలంతా నిర్ణయం తీసుకున్నారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీల కుట్ర రాజకీయాలను ప్రజలు పసిగట్టారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 22నెలల్లో అద్భుత ప్రగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, బట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మండ్లి రాములు, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు, సాయిరెడ్డి, గూడూరు భాస్కర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, నూదిని కొండల్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, పర్వతరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, బీచ్యనాయక్, దశరథం, మానయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్ గెలుపు తథ్యం

కందుకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు ఖాయమని పీసీసీ ప్రధానకార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ ఛైర్మన్ ఎస్.కృష్ణానాయక్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మహేశ్వరం ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం ఆదివారం హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడ డివిజన్‌లో పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండేళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమపథకాలు బాగున్నాయని, తాము కాంగ్రెస్ అభ్యర్థికే ఓటు వేస్తామని ప్రజలంతా ముక్తకంఠంతో చెప్పారని తెలిపారు. ప్రచారంలో కార్యక్రమంలో నాయకులు యుగేందర్ గౌడ్, వెంకటేష్, పాండురంగారెడ్డి, రాకేష్‌గౌడ్, నరసింహ, ఎగ్గిడి కృష్ణ, శేఖర్, కుమార్, మహేందర్, పి.కుమార్, పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఏనుగు జంగారెడ్డి, కృష్ణానాయక్



శంషాబాద్ విమానాశ్రయంలో ఉమ్రా యాత్రికులు

ఉమ్రా యాత్రకు తరలిన ముస్లింలు

శంషాబాద్ రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్రా యాత్రికులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు సందడిగా మారింది. చిన్న, పెద్ద తేడా లేకుండా ఉమ్రా యాత్రకు వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆదివారం చేరుకున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి యాత్రికులు ఉమ్రా యాత్రకు బయలుదేరారు. కాగా, వారు ఉమ్రాలోని మక్కా, మదీనాలో ప్రత్యేక ప్రార్థనలు చేసుకొని వారం, పది రోజుల పాటు అక్కడే ఉంటారు. అందరికీ అల్లాహ్ ఉమ్రా దర్శనం కల్పించడని.. ఎవరైతే భక్తిశ్రద్ధలు, సేవాభావంతో మెలుగుతారో వారికి మాత్రమే ప్రాప్తి కలిగిస్తాడని ఆల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ హాఫీజ్ అలీ ఈ సందర్భంగా తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

షాబాద్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. షాబాద్‌లో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష ఆదివారం 29వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని బొబ్బిలి గామ గ్రామస్థులు దీక్షలో కూర్చున్నారు. వారు మాట్లాడుతూ బీసీలకు రావల్సిన న్యాయపరిమైన రిజర్వేషన్ శాతాన్ని కొందరు కుట్రతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు తమ్మలి రవీందర్, జడల రాజేందర్‌గౌడ్, రాపోల్ నర్సింహులు, గౌరీశ్వర్, శ్రీనివాస్, నవీన్, సురేశ్, రాము, రమేష్, రాజు, సత్యం, గోపాల్, నర్సింహులు, జాంగీర్, రామస్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్షలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

ఘనంగా గ్యార్మీ షరీఫ్

- ప్రత్యేక ప్రార్థనలు, సలాం, దువా కార్యక్రమాలు
- పెద్దసంఖ్యలో ముస్లిం నాయకులు, యువకుల హాజరు

ఆమనగల్లు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పీర్లమసీద్ కాలనీలో మహబూబ్ సుభాని దర్గా వద్ద ఆదివారం గ్యార్మీ షరీఫ్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అంజుమాన్ గులాబ్ ముస్తఫా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు పట్టణ ముస్లిం నాయకులు, యువకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మహబూబ్ సుభాని దర్గా వద్ద నుంచి జెండాతో


అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు


దర్గా వద్ద దువా నిర్వహిస్తున్న నాయకులు, యువకులు

పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో జెండాను ప్రతిష్ఠించి మత గురువు ఆసిఫ్ మౌలానా వాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, సలాం, దువా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అంజుమాన్ గులాబ్ ముస్తఫా కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జామియా మజీద్ అధ్యక్షులు మహ్మద్ మసూమ్, మైనార్టీ నాయకులు అలీబేగ్, చోటేబేగ్, జబ్బార్, బాబా, షర్ఫోద్దీన్, సయ్యద్ ఖలీల్, నయీమ్, రజాక్, అఫ్జల్, షఫీఉల్లా, ఎజాజ్, అలీ మ్, ఖలీం, అఫ్సర్, నాజర్, అంజుమాన్ గులాబ్ ముస్తఫా కమిటీ సభ్యులు అక్రమ్‌బేగ్, బాబా, అజహర్, అబ్బాస్, అమీర్ పాషా, అసద్, అంజద్, సోహెబ్, సోమేల్, గౌస్, రవూఫ్, పాషా,ముదసీర్, ముజామిల్, అబేద్, ముబాషిర్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి.. కొల్లగొట్టి

(ఐదో పేజీ తరువాయి)

ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. చిన్న టిప్పర్ 300 ఎస్ఎఫ్‌టీ అయితే రూ.3వేలు, పెద్ద టిప్పర్ 600 ఎస్ఎఫ్‌టీ లోడ్‌కు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు ఒక్కో టిప్పర్ 6 ట్రిప్పుల వరకు మట్టిని తరలించి అమ్ముతున్నారు. దీనివల్ల రూ.లక్షల్లో సర్కారు ఆదాయానికి గండి పడుతోంది. అయితే, మట్టి మాఫియా దర్జాగా మట్టిని తరలిస్తున్నా.. పట్టించుకునేవారే కరువయ్యారు.

అనుమతులు ఇలా..

ప్రైవేటు స్థలాల్లో మట్టి తవ్వకాలు జరుపాలంటే ముందుగా ఏడీ మినరల్ అండ్ మైన్స్ అధికారికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దానిని అసిస్టెంట్ డైరెక్టర్ పరిశీలిస్తారు. తర్వాత తవ్వకాలకు సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సదరు దరఖాస్తును పంపిస్తారు. స్థానిక తహసీల్దార్ సర్వే నెంబర్‌లోని భూమిని పరిశీలించి ప్రైవేటు భూమి అయితే వాటి వివరాలను పొందుపరిచి తిరిగి ఏడీకి పంపిస్తారు. అనుతులు తీసుకున్న తర్వాత ఆ భూముల్లో భూమికి సమాంతరంగా 2 ఫీట్లకు మించి తవ్వకాలు నిర్వహించకూడదు. కానీ పర్మిషన్ రాగానే 8 నుంచి 9 ఫీట్ల లోతులో తవ్వకాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. 2 ఫీట్లకు మించి తవ్వకాలు జరిపితే అనుమతులను రద్దు చేయాల్సి ఉంది. కాని అది అమలుకు నోచుకోవడం లేదు. సంబంధిత రెవెన్యూ అధికారులు మాత్రం తమకు దృష్టికి రాలేదంటూ చేతులు దులుపుకుంటున్నారు.

అడ్డగోలుగా తవ్వకాలు

కొందుర్గు మండల కేంద్రంలోని 109 సర్వే నెంబరులో 74.28 ఎకరాల్లోని ప్రభుత్వ భూమిలో కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు కొందుర్గు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన గ్రామ పరిపాలన అధికారి కె.నరేష్‌ను తవ్వకాలు జరిగే ప్రాంతానికి పంపించారు. ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుతులు లేకుండానే అడ్డగోలుగా మట్టి తవ్వకాలు జరుపుతున్న విషయాన్ని తహసీల్దార్‌కు వివరించగా.. వాటిని నిలిపివేసి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. సాక్షాత్తు మండల కేంద్రం పరిధిలోనే అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతుంటే అధికారులకు తెలియకపోవడం విడూరంగా ఉందంటూ అక్కడి ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. అలాగే మండల పరిధిలోని చుక్కమెట్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ చుక్కమెట్‌గుట్టలో కూడా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు పెద్ద కొండలా ఉండే ఈ గుట్ట ప్రస్తుతం నేలమట్టమైంది. కేశంపేటలోని సంగెం గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామంలోని సర్వే నెంబర్ 20లోని వక్ఫ్‌బోర్డు పరిధిలో గల ప్రభుత్వ స్థలంలోనూ పెద్ద ఎత్తున మట్టిని తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు పెద్దల హస్తంతోనే మట్టి తవ్వకాలు జరిపినట్లు సమాచారం. తవ్వకాలపై గందరగోళం నెలకొనడంతో రెండు రోజుల క్రితం నుంచి మట్టి తరలింపును నిలిపివేశారు.


భూమి పూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

అన్నదాన మండపం నిర్మాణానికి భూమిపూజ

కేశంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన మండపానికి భూమి పూజ చేశారు. అయ్యప్ప స్వాములు, భక్తుల సౌకర్యార్థం అన్నదాన మండపాన్ని నిర్మిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు తిరుమలయ్య గౌడ్ రమణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అయ్యప్ప మాల ధారణ భక్తులు యుగంధర్ తలసాని పవన్ కుమార్ రెడ్డి, రమేష్, రవి, గోపాల్ యాదవ్, నాయకులు మోహన్ రెడ్డి పాండు గౌడ్, దామోదర్ రెడ్డి, పిల్లి అమరేష్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు చేవెళ్లలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేవెళ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో నేడు(సోమవారం) మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతులు మీదుగా కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

తలకొండపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని ఎల్లికట్ట తండాకు చెందిన గాంగ్య నాయక్ అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదివారం ఉప్పల ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. ట్రస్ట్ ద్వారా వెంకటేశ్ సమకూర్చిన రూ.3 వేలను స్థానిక నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో కేశవులు, కృష్ణ, ప్రభు, మట్టస్వామిగౌడ్, సంధ్యానాయక్, పత్యానాయక్, రవి నాయక్, కళ్యాణ్ నాయక్, శివనాయక్, తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి


ఆమనగల్లు : పూజలు నిర్వహిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. దైవ కార్యక్రమాల్లో అందరూ పాలు పంచుకోవాలని కోరారు. ఆమనగల్లు, వెల్దండ, తలకొండపల్లి మండలాల్లో ఆదివారం రాఘవేందర్‌రెడ్డి పర్యటించారు. చౌదర్‌పల్లిలో నిర్మిస్తున్న బాలభీమాంజనేయస్వామి ఆలయాన్ని సుంకిరెడ్డి సందర్శించి పూజలు నిర్వహించారు. ఫౌండేషన్ ద్వారా రూ.6 కోట్లతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. సన్మార్గంతో ముందుకు సాగితేనే ఆనందకర జీవితాన్ని పొందుతామన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముకుంద, చెన్నయ్య, చంద్రయ్య, గణేశ్, వెంకటయ్య, నరేందర్‌గౌడ్, యూసుఫ్, బాబా, గణేశ్, రమేశ్, కొండల్, శేఖర్, శ్రీను, కల్యాణ్ పాల్గొన్నారు.


తలకొండపల్లి : పూజలో సీఎల్ శ్రీనివాస్ యాదవ్

మైసమ్మ దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

కడ్తాల్ : రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్, రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్‌లు కోరారు. గిరిజనుల ఆరాధ్య దైవం మైసమ్మ ఆలయ అభివృద్ధి, భక్తుల సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం రాంబాబు నాయక్, లక్పతి నాయక్‌లు సందర్శించారు. ఈమేరకు మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలి పంతూతో సమావేశమయ్యారు. సమాజ శ్రేయస్సును కాంక్షించి ఆలయ ఆవరణలో మూడు రోజుల పాటు సహగ్ర చండీయాగం నిర్వహించడం పట్ల ఆలయ నిర్వాహకులను ఈ సందర్భంగా వారు అభినందించారు. దైవ కార్యక్రమాల్లో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్పీ జ్యోతి, సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేఖ్యానాయక్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి నాయక్, నాయకులు అరుణ్‌నాయక్, భాస్కర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, సీతారామ్‌నాయక్, నాగేశ్‌నాయక్, తదితరులు ఉన్నారు.


కడ్తాల్ : మైసమ్మ పూజలో రాంబాబునాయక్

సన్మార్గంతోనే దైవానుగ్రహం

తలకొండపల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని తలకొండపల్లి మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దైవ కార్యక్రమాలలో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం వెల్జాల శ్రీ వేదాద్రి లక్ష్మీనరసింహ దేవాలయాన్ని ఆదివారం శ్రీనివాస్ యాదవ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దైవ చింతనను అలవరుచుకోవాలన్నారు. ఆధ్యాత్మికతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవనం పొందుతారని అన్నారు. ఆయనతో వెంకటయ్య, లింగం గౌడ్ తదితరులు ఉన్నారు.



రోడ్డుపై ధాన్యం ఆరబోత

- పొంచి ఉన్న ప్రమాదం

ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోల్కంపల్లి నుండి అనాజ్‌పూర్ వెళ్లే రోడ్డుపై ఆరబోసి ధ్యానం కుప్పలతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. పంట ఉత్పత్తులను ఆరబెట్టేందుకు రైతులకు కల్లాలు లేకపోవడంతో తారు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. కోసిన వరి పంట దిగుబడుల్లో తేమ శాతం తగ్గించుకునేందుకు రోడ్లపై ధాన్యం రోడ్లపై రోజుల తరబడి ఉండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయంలో ధాన్యం కుప్పలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో వరి కుప్పలతో మృతువాత పడిన ఘటనలు ఉన్నాయి. రోడ్లపై ధాన్యం పోసి రైతులు ప్రమాదాలకు కారణం కావొద్దని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రైతులకు వడ్లు ఆరబోసుకునేందుకు కల్లాలు ఏర్పటు చేసి రోడ్లపై వడ్ల కుప్పలు తొలిగించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు సంబంధించిన శాఖ అధికారులను కోరుతున్నారు.

- ఆదిభట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి)

ఘనంగా భీంభరత్ జన్మదిన వేడుకలు

చేవెళ్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం భీంభరత్ నివాసం వద్ద జరిగిన వేడుకల్లో చేవెళ్ల మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరై పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాములు, బీర్ల మల్లేశ్, సుశాంత్, హరీశ్‌రెడ్డి, బండారి గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, బురాన్ సురేష్, పైండ్ల ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భీంభరత్-జ్యోతి దంపతులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలి

కేశంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలని తెలంగాణ స్టేట్ సేల్స్ మేనేజర్ నరసింహారెడ్డి అన్నారు. మొక్కజొన్నలో కలుపు నివారణకు గోద్రెజ్ అగ్రోవేట్-ఐఎస్‌కే జపాన్ సంయుక్త ఆధ్వర్యంలో అషిటాక అనే కలుపు నివారణ మందును తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓగార్డెన్‌లో డీలర్లు, రైతులతో కలిసి అషిటాక కలుపు నివారణ మందును ఆయన ఆవిష్కరించారు. ప్రాంతీయ పంపిణీదారు సంజీవరెడ్డి, సుచిత్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది శరత్ చంద్ర, శిరీష, రాజు, శివతేజేశ్వర్ రెడ్డి, సుష్మ, సునీల్ కుమార్, రుద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కలుపు మందును ఆవిష్కరిస్తున్న గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు, డీలర్లు

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

కందుకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు (సోమవారం) మండలంలోని పులిమామిడి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు మండల విద్యుత్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ధన్నారం, పులిమామిడి, పెద్దమ్మ తండా, మురళీనగర్, చిప్పలపల్లి, బంజరుగడ్డ తండాలకు సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం!


రోడ్డుపై నిర్మించిన డివైడర్

(ఐదో పేజీ తరువాయి)

ప్రధాన రహదారి సందబావి నుంచి తలకొండపల్లి మండల కేంద్రం వరకు రెండు లేన్ల రోడ్డు విస్తరణ సెంట్రల్ రోడ్ ఫండ్స్ నుంచి రూ.37 కోట్లు మంజూరయ్యాయి. నాలుగు నెలల క్రితం మంజూరైన పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించి ఆమనగల్లు సురసముద్రం చెరువు వరకు పూర్తి చేశారు. పట్టణంలోకి వచ్చే రోడ్డులో సుర సముద్రం చెరువు కట్ట బ్రిడ్జి వద్ద కొంత మేర పనులు నిలిచిపోయాయి. ఆరు నెలల క్రితం పట్టణంలోని రాజీవ్ కూడలి నుంచి సందబావి వరకు వెళ్లే రోడ్డు విస్తరణ పనులను తిరిగి ప్రారంభించారు. 60 ఫీట్ల విస్తీర్ణంలో రోడ్డు చేపట్టాల్సి ఉండగా రోడ్డుకిరువైపులా ఉన్న ఇళ్ల యజమానుల అభ్యంతరంతో మళ్లీ కొంత కాలం పనులు నిలిచిపోయాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకొని స్థానిక నివాసులతో మాట్లాడి రోడ్డును 50 ఫీట్ల విస్తరణకు కుదించారు. ఆ తర్వాత రోడ్డుకిరువైపులా ఇళ్లను, దుకాణాలను తొలగించి సీసీ రోడ్డు నిర్మించి రహదారిని విస్తరించారు. దీంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు రహదారి మధ్యలోకి మారి ప్రమాదకరంగా మారాయి. ఇందుకు తోడు ఇటీవల డివైడర్ల నిర్మాణం ప్రారంభించారు. దీంతో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోకి ఉండిపోయి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే రెండు, మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ రహదారి మీదుగా నిత్యం దేవరకొండ, మాడ్గుల, చారకొండ, ఇర్విన్, నల్లగొండ, నాగార్జున సాగర్‌కు వందలాది వాహనాలు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. రద్దీగా ఉండే ఈ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల కారణంగా భారీ ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న దాదాపు 8 స్తంభాల కారణంగా పెద్ద వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఆర్‌అండ్‌బీ, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు ఈ విషయంలో సమన్వయంతో ముందుకు సాగాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్ అండ్‌బీ శాఖ అధికారులను వివరణ కోరగా సీఆర్ఎఫ్ నిధుల ద్వారా రోడ్డు విస్తరణ మాత్రమే చేపట్టడం జరుగుతుందని, విద్యుత్ స్తంభాల తొలగింపు గురించి విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులకు నివేదించామని తెలిపారు. కాగా స్తంభాలు మార్చేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే రోడ్డు మధ్యలో స్తంభాలను తొలగించి పక్కకు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా డీఈ బాలకృష్ణ తెలిపారు.

అంచనాలు రూపొందించాం



ఆమనగల్లు పట్టణంలోని తలకొండపల్లి రోడ్డు సురసముద్రం చెరువు బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ మీదుగా మాడ్గుల రోడ్డు సందబావి వరకు రహదారిని విస్తరించడం జరిగింది. దీంతో గతంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోకి వచ్చినట్లు అయ్యాయి. 19 విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవాటిని వేయడానికి అంచనాలు రూపొందించి అనుమతికి ఉన్నతాధికారులకు నివేదించాం. మున్సిపాలిటీ నిధులు చెల్లించిన వెంటనే ఆ స్తంభాలను పక్కకు ఏర్పాటు చేస్తాం. మాడ్గుల రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ఒక విద్యుత్ స్తంభాన్ని రెండు రోజుల్లో పక్కకు మారుస్తాం.

- సీహెచ్ బాలకృష్ణ, ఏడీఈ, ఆమనగల్లు